# చైనా చిలుకలు ★

అవసరాల
రామకృష్ణరావు

(పెద్ద డిటెక్టివ్ కథ)

దూరంగా ఐదుగురో ఆరుగురో మొగాళ్ళూ, ఒక్క ఆడదీ కొబ్బరిచెట్టు నీడని కనిపించారు శాంతకి. బండీవాడికి డబ్బులిచ్చేసి దిగి వాళ్ళదగ్గరకు వెళ్ళింది.

"ఏమండీ! చిలకల ద్వీపం వెళ్ళే లాంచి ఎప్పుడు వస్తుంది?" అనడిగింది. అట్టే అందంగా లేకపోయినా ఆమె అలంకరణచూసి చిన్ననవ్వు నవ్వుతూ.

"మీరూ చేరరూ? రండి, రండి. వేసిసంఖ్య బెడసికొడుతుందేమోఅని చూస్తున్నాం. మీతో ఎనమండుగురం. మేమంతా చిలకలద్వీపానికే" అన్నాడందులో ఒకడు.

"అమ్మయ్య!" అనుకుంది శాంత. "అయితే లాంచి ఎప్పుడు బయలుదేరుతుందో?" అని మళ్ళీ అడిగింది. "మాకూ తెలీదు. మేమందరం యీ ప్రదేశానికి కొత్తే." శాంత ఆశ్చర్యపోయింది. అందులో ఉన్న ఆవిడ యీవిడని మొగాళ్ళకి కాస్త ఎడంగా పిల్చి "అయితే మనదేవూరు పిన్నిగారూ?" అని అడిగింది. శాంతకు ఆ సంబోధన నచ్చలేదు. వెంటనే ఆమాటకు జవాబు చెప్పక తిరుగుప్రశ్న వేసింది.

"మీరందరూ పెళ్ళికిగాని వెడుతున్నారేమిటమ్మాయ్?" అమ్మాయా? అమ్మాయేమిటి? తను మంచి వయస్సులో ఉన్నదిగాని చిన్నపిల్లేం కాదు. కోపంతో పమిట మరోమారు గట్టిగా వేసుకుని "మేమందరం ఏమిటి?" అంది.

"అక్కడున్నారు కదమ్మా, వాళ్ళూ మీరూను."

"వాళ్ళు నాకేంకారు. వాళ్ళకీ నాకు సంబంధమే లేదు."

"అదేమిటీ! మరి నువ్వెక్కడికీ?"

"చిలకలద్వీపానికే."

"అక్కడ మీకేం బంధువులా?"

దీనికి జవాబుగా విమల పమిట మడతలో దాచినఒకకవరుతీసిఇచ్చింది. అందులో ఇలావుంది:

"విమలా, నీకు నే జ్ఞాపకంఉన్నానా? పదేళ్ళ క్రిందట మనం అడయారులో కలుసుకున్నాం. నీతో మాట్లాడవలసిన విషయాలుకొన్నున్నాయి. వెంటనే నాకు భంగపాటు కలిగించకవస్తే చాలా సంతోషిస్తాను. జగన్నాథపురం వస్తే అక్కడ ఎర్రవరంపోయే బస్సులుంటాయి. ఆ బస్సెక్కి దారిలో కృష్ణరేవు దగ్గర దిగిపో. అక్కడ్నుంచి చిలకలద్వీపం లాంచీలుంటాయి. నాకోసం యీ మాత్రం శ్రమలకు ఓర్వడానికి వెనుదియ్యవనుకుంటాను.—"ఎ. తె."

"ఎవరండీ ఆవిడ? మీరు చిన్నప్పుడు ఎరుగుదురా?"

"ఎవరయితేనేం పోనిద్దురూ, మొగుడూ అత్తమామలూ, జబ్బులూ, చాకిరీ చేసిచేసి ప్రాణం విసుగెత్తిపోతోంది. ఎవయినా రమ్మంటారా అని చూస్తున్నాను. పడవప్రయాణం, సముద్రగాలీ, కాస్త నాలుగురోజులపాటు ప్రాణానికి హాయిగా ఉంటుంది."

"అయితే ఆవిడని మీరెరగరన్నమాట. అయినా ఆవిడో,ఆయనో? నా ఉత్తరంలోనూ యిదే సంతకం సుమండీ! మరో రెండక్షరాలు ఎక్కువ."

"మీ ఉత్తరమేమిటి?"

"మరి నేనెందుకనుకున్నారు చిలకలద్వీపానికి ప్రయాణమయ్యాను? ఇదిగో యిలా చూడండి" శాంత విమలకు ఉత్తరం యిచ్చింది; విమల ఇలా చదివింది:

హెడుమిస్ట్రెస్ శాంతగారికి—మీకు వర్క ఎక్కువని, జీతం తక్కువని విని చాలా విచారిస్తున్నాను. మీరు పాఠాలు బాగా చెప్తారని విన్నాను. నా పిల్లలిద్దరు చదువుకి ఉన్నారు. మీరు చెప్పగలరా? మీరు కోరిన జీతం యిస్తాను. చిలకల ద్వీపానికి వస్తే అన్ని విషయాలూ మాట్లాడుకోవచ్చు. ఖర్చులికి యిందులో పాలికరూపా

యలు పంపుతున్నాను."—"ఏ. తె. ఆ. రామన్న"

"ఇదేం సంతకమండీ ఆశ్చర్యంగా ఉంది? "ఏ. తె." అంటే ఏమిటంటారు?"

"ఎంత ఆలోచించినా నాకా పేరుకి అర్థం తెలియడం లేదు; ఇలాంటి పేరు నేను వినసూ లేదు."

"మరి ఏమంటూ వచ్చారండీ?"

"మీరెలా వచ్చారో అలాగే. ఏమిటండీ వెధవది, చెప్పినపాఠాలే చెప్పి ఒళ్లు మండి పోతోంది. మార్పు అనేది లేకపోతే సుఖం ఎలా ఉంటుంది చెప్పండి? ఆయనెవరయితేనేం, పేరే దయితేనేం, రమ్మన్నాడు, వెడుతున్నాను. నా అదృష్టం బాగుండి, వారు సరిఅయిన జీతమిస్తే అక్కడే ఉండిపోతాను. ఏమంటారు?"

"మరే."

"సరేకాని వాళ్ళంతా ఎవరండీ, ఎందుకొచ్చారు?"

"నాకూ తెలీదుగాని, వాళ్ళనుకుంటూంటే విన్నాను: వాళ్ళని మనలాగే కొందర్ని సరదాగానూ, కొందర్ని పనులమీదా యీరోజునే రమ్మని పిలిచాడుట."

"ఎవరూ, మనల్ని పిలిచిన ఆత నేనా?"

"మరే."

"సరేకాని, వాళ్ళెవరేమిటి?"

"అల్లరుగో అలా చూశారా, పొడుగ్గా ఉన్నారూ, ఆయనే జస్టిస్ జగన్నాథంగారని హైకోర్టు జడ్జీట. ఆ రెండో అతను మాధవసింగ్ అని ఆయనికి సింధియాలో పనిట. ఆ నీలం బుష్ కోటు తొడుక్కున్నాయన డాక్టరు సుధాకర్. చుట్టముట్టించారే ఆయన గోపాలరావు నాయుడు గారు. ఇందాక మీతో మాట్లాడినతని పేరు రామారావు. ఆ ప్రక్కని ఆకుపచ్చ రుమాలు చేత్తో పటుకున్నాడే ఆయన ప్రసాద్. మీరు వచ్చిన బస్సుకి ముందుబస్సులో నేనూ డాక్టరూ జగన్నాథంగారూ, ప్రసాదుగారూ ఉన్నాం. వాళ్ళకేం పనులో నాకు తెలీదు."

"ఈ కొంచెం సేపట్లోనే కోటి వివరాలు కనుక్కున్నావ్, తక్కువదానివి కాదమ్మోయ్ నువ్వు!"

"దానికేముందండీ, నలుగురితో సోషల్‌గా ఉంటే యిన్నేం, యింకో అన్ని విషయాలూ తెలుస్తాయి. ఎందరయితేనేం, ఆడదాని సాటా? నేనొక్కర్తెనేమో అని బెంగెట్టుకున్నాను. దేవుళ్ళా మీరు తోడుదొరికారు. అంతేచాలు."

"దానికేంగాని, లాంచి వచ్చేసినట్టుంది, వాళ్ళూ పిలుస్తున్నట్టున్నారు. లాంచిలో ఎవరూ కనపడరేం?"

లాంచిమీద, దూరంనుంచి అస్పష్టంగా కనిపించిన అయిదక్షరాలూ దగ్గరకి రాగానే చూసి శాంత ఎందుకో గతుక్కుమంది. ఆ లాంచిపేరు "దుష్టశిక్షణ!"

"సరే పదండి, మీ సామానులేవి?"

"ఈ నాలుగురోజుల భాగ్యానికీ పెద్దసామానులేముంటాయమ్మా? పెట్టే బెడ్డింగూ తెచ్చుకున్నాను. చాలదంటావా?"

"చాలకేం? నేతెచ్చుకున్నదేం గనక? రండి, రండి వాళ్ళు పిలుస్తున్నారు."

సామాన్లు తీసుకుని అందరూ లాంచిదగ్గరకు వెళ్ళేరు. జస్టిస్ జగన్నాథం డ్రైవర్ని అడిగేడు.

"ఏమోయ్! ఇందులో ఎవరూ లేరేం?"

"రామన్నగారు యిది ప్రత్యేకం మీకోసమే కుదిర్చారండి బాబూ!"

"ఎవరా రామన్నగారు?"

"ఆ మహరాజులు స్వయంగావచ్చే ఖర్మమేమిటి బాబూ! గుమాస్తాయేవచ్చి అడ్వాన్సుగా అంత అద్దె చెల్లించి వెళ్లేడు. 'కృష్ణ రేవుదగ్గర—బుధవారం మాధ్యాహ్నం ఎనమండుగురు వస్తారు వాళ్ళను చిలకల ద్వీపంలో దింపిరా' అని చెప్పేరు అంతే నాకు తెలుసు."

"చిలకలద్వీపంలో రామన్నగారున్నారా?"

"నాకు తెలియదుబాబూ, రండి ఎక్కండి." అందరూ లాంచి ఎక్కేరు. జలకల్మషాన్ని చూసుకుంటూ "దుష్టశిక్షణ"లాంచి చిలకలద్వీపంవైపు పరుగుతీసింది.

* * *

లాంచిలోంచి అందరూ దిగిపోయారు. లాంచి తిరిగి వెళ్లిపోయింది.

"మనవాళ్ళు ఊరికే దేనికీ ఏపేరూ పెట్టరుసుమండీ!" జగన్నాథం మాటలు విని ప్రసాద్ అడిగాడు.

"దేన్నిగురించి మీరు అంటున్నారు?"

"అదిగో అలా చూడండి ఆ చిన్న కొండ వైపు. కొంచెం చిలకలా లేదూ?"

అందరూ అటువైపు చూశారు.

"కొంచెమేం, బాగా పోలికఉంది, కూర్చున్న చిలకలా ఉంది. అందుకే కాబోలు 'చిలకల ద్వీపం' అన్నారు" అన్నాడు సుధాకర్.

"ఇందర్నీ ఒక్కసారి పిలిపించడానికి కారణ మేమిటో?" అంది అప్రయత్నంగా శాంత.

"ఏమైయుంటుంది? ఏ శుభకార్యమేనా అయి ఉంటుంది. అందుకే ఆయనెవరో సరదాగా ఫ్రెండ్స్‌నీ రెలిటివ్స్‌నీ పిలిచి ఉంటాడు" అన్నాడు నాయుడుగారు.

"వాళ్ళింటికి దారెటో మనకెలా తెలుస్తుందీ?" అని అడిగేడు రామారావు.

"అదిగో ఎవరో వస్తున్నట్టున్నారు, కను క్కుందాముండండి" అంది విమల.

వాళ్ళనే వెతుక్కుంటూవచ్చినట్టు యిద్దరు కాపు మనుష్యులు ఆ దారిన వచ్చారు.

"ఆలిస్యం అయిపోయినాది, చమించాల" అన్నాడందులో మొగాడు చేతులు నులుపు కుంటూ.

"ఎవరు మీరు? రామన్న గారి నౌఖర్లా?" అని మాధవసింగ్ అడిగాడు.

"రావన్న గోరా? ఆయన నెవరు?" అని తల గోక్కున్నాడు వెంకన్న.

"అంత మరుపేటి రామాఁవా? రావన్నగో రంటే మన దొరగారురా! మొన్న మనకు సీటీ పంపినోరుకద! టామరి" అంది అతని యిల్లాలు కాబోలు లచ్చి.

"మీకూ పంపేరూ చీటి? ఉత్తరంలేకుండా యిక్కడికి వచ్చినవాడు ఒక్కడూ లేడు కాబోలు ఏమని పంపేరు? ఇంతకీ ఎవరు మీరు?" జగన్నాథం అడిగాడు.

"మేము యిజయనగరంలో రాళ్లుకొట్టేవోళ్లం బాబూ! మొన్నీపాటి ఏలకి నాపేర నో సీటీ వచ్చింది. వెంకట్రావు బాబుగారి చేత సది గించుకున్నాను. వెంటనే నువ్వూ, నీయింటిదీ చిలకల ద్వీపం రండి. బుధవారంనాడు నా స్నేహితులు ఎనమండుగురు ఆడకొస్తారు. వాళ్ళని తగినట్టు ఆదరించడమే మీపని, ఇందులో దారి బత్తెం పంపుతున్నాను" అని. రాళ్లు కొట్టి కొట్టి జబ్బలు పడి పోనాయిదొరా! ఇదేటివిటో సూద్దామని నిన్ననే యీడకొచ్చేసినాం. వాళ్ళ గుమాస్తాట! కృష్ణరేవుదగ్గిర అగుపడి యీయింటి తాళాలిచ్చి "యిల్లు సుభ్రంగా కడిగేసి సుబ్రం గుంచండి. రేపు దొరగారు వచ్చేదాకా యిల్లు కనిబెట్టుకు ఉండండి" అన్నారు. మేమిద్దరం నిన్ననగా వచ్చాం. ఓయిరుగూ నేదు, పొరుగూ నేదు...యింత ద్వీపానికీ యిదొకటే యిల్లులా ఉంది. రాత్రి తెల్లవార్లూ బితుకూ బితుకూమని కునుకడితే ఒట్టు. ఒచ్చారం లేచాలు, మా బాబులు!"

వచ్చిన అతిధులు నడుస్తూంటే వెంకన్న దార్లో చెప్పిన కబుర్లు యివి.

"పోనీ రేపొస్తారు గదా! మీబాబు ఫరవా లేదులే!" అని ధైర్యంగా కుడిచేత్తో గుండె రాసు కుంది విమల. అందరూ యిల్లుచేరుకుని ఎవరి గదిలో వారు ప్రవేశించారు. ఆ యింట్లో తొమ్మిది గదులున్నాయి. అందులో ఎనిమిది వచ్చిన అతిధులకీ, ఒకటి వెంకన్నా లచ్చీ పడు కునేకొట్టు. ఇవిగాక హాలూ, వంటగదీ నాలుగు బాత్‌రూంలూ—ప్రతివ్యక్తికీ కావలసిన సదుపా యాలతో అమర్చబడి ఉంది. ప్రతి గదికి భద్రత కోసం తాళాలుకూడా ఉన్నాయి. భోంచేసి అందరూ హాలులోకి వచ్చి కూర్చున్నారు. లచ్చి ఆక్కడకు తమలపాకులు తెచ్చిపెట్టింది. విమలా శాంతా చాపమీద కూర్చున్నారు. తమలపాకులకి సున్నం రాసి మాధవ్‌సింగ్‌కి యిచ్చింది శాంత. అతను సంశయించి "వారందరకూ యివ్వండి, తర వాత నే వేసుకుంటాను" అన్నాడు.

"ఓ వరుసనుంచి యిస్తున్నానుగా! మీరలా మొహమాటపడితే లాభంలేదు. మన మందరం ఓ కుటుంబంలో మనుష్యుల్లాంటి వాళ్ళం. మంచికో చెడ్డకో యిక్కడకువచ్చాం" ఈ ఆఖరి మాట ఒణుకుతున్న కంఠంతో అంది శాంత.

"నీ నోటి చలువగా మనం మంచికే వస్తే సరే సరి తల్లీ" అన్నాడు జస్టిస్ జగన్నాథం.

"కాక? ఏమిటి మీమాట? అనుకుంటే అన్నీ భయాలేగాని లేకపోతే ఏమీలేదు. చూడండి ఆ కిటికీలోంచి ఎంతమంచిగాలి వస్తోందో! ఇలాంటి చక్కని సముద్రపుగాలి పీల్చి ఎన్నేళ్ళ యిందో!" అన్నాడు ప్రసాద్.

"అది... 'అదేమిటి?" అంది, విమల దేన్నో చూపిస్తూ. అందరూ అటువైపు చూశారు. ఇంత సేపై ఆ యింటిలోకి వచ్చినా ఎవరూ దాన్ని గమనించనే లేదు. హాలులో గోడమీద ఎవరికీ అందనంతపైకి నల్లని అక్షరాలతో ఓ పద్యం రాయబడి ఉంది. ఏమిటది?

"చైనాచిలుకల పదిసమూహమూ
చిక్కుల వలలో చిక్కిందీ
మొదటి చిలుకకూ సారాభ్రమలో
ముప్పేచివరకు దక్కిందీ
తొమ్మిది చిలకలు తుర్ తుర్ మంటూ
తోటివాటితో ఎగిరాయీ
రెండవచిలుకకు నిదురే మృత్యువు
రెండుచిలుకలూ తరిగాయీ
మిగిలిన చిలుకల గుంపువరుసగా
మేతకు వనిలో ఎగిరిందీ
మూడోచిలుకకు ఏమిమూడెనో
మూర్చిలి మొగమే తిరిగిందీ
గారడిచిలుకలు వంటపొయ్యిలో
కర్రలు దూర్చగ కదిలాయీ
కర్రలాటలో బుర్రపోయెను
కడకూ ఆరే మిగిలాయీ
అయిదో శారిక తేనెగూటితో .
ఆటలు ఆడగ కోరిందీ
ఈగ కాటులే చావుపోటుగా
ఈశ్వరసన్నిధి చేరిందీ
అయిదు చిలకలూ సాయంకోసం
హా హా కారం చేశాయీ
శరణం మరణమె ఆరవ చిలుకకు
శభాషు! నాలుగె నిలిచాయీ
ఎంతో భయముతో నాలుగు చిలకలు
యిసుకనేలపై తిరిగాయీ
కాలుజారెనో—వెనుకతోసెనో
కడకూ మూడే మిగిలాయీ
చైనాచిలుకల త్రయము భయముతో
జంతుశాలలో తిరిగిందీ
వానరుడే ఒక నరునకు మృత్యువు
వరుసకు ఒకటే తరిగిందీ
రెండుచిలకలలో ఒక్కటి భయమున
ఎండలో రెక్కలు విచ్చిందీ
గుండుదూసుకుని చిలక తారుమని
గిలగిల కొట్టుకు చచ్చిందీ
చైనాచిలుకల పది మొత్తంలో
చివరికి ఒకటే మిగిలిందీ
ఐనా మిగిలెన? ఉరిత్రాడేగతి!
అయ్యో ఖాళీ మిగిలిందీ!"

## 2

"ఏమిటంటారు యిది?" అంది వణుకుతూ విమల.

"ఏటో, దేనికో—దీనివుద్దేశ మేమిటో రేపు అతనెవడో రానియ్యండి కనుక్కుందాం. మీరు ప్రతీదానికీ అలా భయపడితే ఎలాగ?" అని నచ్చచెప్పేడు రామారావు తను లోపల భయపడుతున్నా.

"బాబూ, బాబూ యివి చూశారా?" గబగబా వస్తూ వెంకన్న అడిగాడు.

"ఏమిటి?" అందరూ కుతూహలంగా అటు తిరిగారు. "ఇలారండి . యీ సిలకలు సూడండి" అందరూ అతని వెనుకగా వెళ్ళేను. హాలుకీ వంటింటికీ మధ్య చిన్న గది ఉంది. ఆ గదిలో ఒకమూలగా ఒక గుండ్రని టేబిలు ఉంది. దాని మీద పసుపు పచ్చని గుండ్రని టేబిల్ క్లాతు మీద పది మట్టి చిలుకలు! చూడ ముచ్చట వేస్తున్న రంగురంగుల మట్టి చిలుకలు. హాలులో గడియారం ఎనిమిది గంటలు కొట్టింది. దేనినో మరిచిపోయినట్టు వెంకన్న ఎక్కడికో వెళ్ళడం వారు గమనించనే లేదు.

"సోదర సోదరీ మణులారా! దయచేసి కాస్సేపు నిశ్శబ్దంగా ఉండండి"

ఏమిటి? ఎక్కడిదీ శబ్దం? ఏమిటి దీని అర్థం? అందరూ ఒకరిమొహం ఒకరు చూసుకున్నారు అందరూ అక్కడే ఉన్నారు. మరెక్కడిదీ శబ్దం?

"మీరు ఒక్కొక్కరు యీ క్రింది నేరాలు చేశారు! జ్ఞాపకముందా?"

"డాక్టరు సుధాకర్ 15 సెప్టెంబరు 31 లో సుబ్బారావు మృతికి కారకుడు"

"శ్రీమతి శాంత జనవరి 6; 38 లో చిట్టి పాప హత్యకు కారకురాలు"

"ప్రసాద్ అక్టోబరు 16, 39 లో నారాయణ మూర్తి చావుకు కారకుడు"

"విమల జనవరి 5; 40 లో సుబ్బులక్ష్మి హత్యకు కారకురాలు"

"మాధవసింగ్ ఆగస్టు 5, 39 ప్రతాప్ చావుకి కారకుడు"

"రామారావు మార్చి 30, 42 న సీతమ్మ మరణానికి కారకుడు"

"గోపాలరావు నాయుడు ఫిబ్రవరి 12, 37 లో వెంకట్రావు చావుకి కారకుడు"

"వెంకన్నా, లచ్చి మే 8 వ తారీకున 38 లో చిట్టిపంతులు హత్యకు కారకులు"

"జస్టిస్ జగన్నాథం జూలై 16, 29 లో రామకోటి చావుకి కారకుడు"

మోసం మింగిన మొలకల్లారా!

చేతికి చిక్కిన చిలకల్లారా!

ఇంకా మీరు చెప్పుకోనే దేమైనా ఉందా?"

ధ్వని ఆగిపోయింది. మళ్ళీ యీ ధ్వనిని మించిన పెద్ద ప్రతిధ్వని!! లచ్చి తెస్తూ తెస్తూన్న కాఫీ ట్రే అక్కడ ఎత్తేసి పడిపోయింది. సుధాకర్ మందులబేగ్‌తో అక్కడికి వెళ్ళేడు. పరీక్షించి యిలా అన్నాడు.

"మరేం భయంలేదు, మూర్ఛపోయింది, పాపం, అంతే. కొంచెం చన్నీళ్ళు తీసుకురా" వెంకన్న పరుగెత్తేడు.

"ఏమిటీ శబ్దం? ఎక్కడిదీ ఆకాశవాణి??" ఒణుకుతూ అన్నాడు రామారావు.

"ఏమిటి? ఎవరు మనతో హాస్యాలాడుతూంట? ఏమిటి దీని అర్థం?" నాయుడుగారు నాలిక తడారిపోతూ అన్నారు.

"ఏమో, ఏమో, ఏమో!" ఇదే ఎవరుచెప్పిన జవాబు అయినాను. మొహానికి పట్టిన చెమట బిందువులు తుడుచుకుంటున్నాడు ప్రసాద్.

విమలా, శాంతా కొయ్యలైపోయి ఓ చోట ఒకళ్ళొకరు పట్టుకుని కూలబడ్డారు. అందర్లోకీ మాధవసింగూ, జగన్నాథం, కాస్త ధైర్యంగా కనబడ్డారు. సుధాకర్ లచ్చికి తెలివి తెప్పించడంలో నిమగ్నుడై ఉన్నాడు. వెంకన్న అక్కడే చేతులుకట్టుకు నిలబడ్డాడు.

"ఏంబాబూ తగ్గుతాదంటారా?" ఆత్రుతతో అడిగేడు వెంకన్న.

"తగ్గకేం, కళ్ళిప్పిందిచూడు" లచ్చి కళ్ళు తెరిచింది.

"సిట్టి పంతులూ! సిట్టిపంతులూ!! ఏడ నున్నావ్ సిట్టి పంతులూ! సచ్చినా మామీద పగసాదిస్తున్నావా?"

ఈమాటలు విని వెంకన్న గుండె ధన్‌ధన్‌మని కొట్టుకుంది.

"లచ్చీ లచ్చీ మరేం భయంలేదు. ఇక్కడే చిట్టిపంతులూ లేడు: నువ్వేంభయపడకు. ఇదిగో యీ నారింజపళ్ళరసం తాగు" లచ్చి కళ్ళు తెరిచి దీనంగా భయంగా చూసింది.

"ఎవరు? ఎవరీపని చేసింది? లచ్చి, వెంకన్న, సుధాకర్ ఒక్కసారే అటుచూశారు. జగన్నాథం చేతిలో ఏదో రికార్డు ఉంది. వెనక తక్కిన అరుగురూ ఉన్నారు.

"మా గుండెలు భయంతో విచ్చిపోయాయి. మా మొహాలు చెమటతో తడిసిపోయాయి. ఈ మాటలు ఎవరన్నారు, ఏ శిలాహృదయంనుంచి యీ పలుకుల ములుకులు వచ్చాయో అని గింజుకు చచ్చాం. ఇల్లంతా వెతికేం. ఇదిగో యీ రికార్డే యింతపనీ చేసింది. ఎవరు దీన్ని పెట్టింది?" ప్రసాద్ ఒణుకుతూ అడిగాడు.

"నేనుబాబూ, నేను! నేనే ఆ రికార్డు పెట్టేను" అందరు ఆశ్చర్యపోయారు ఇలాంటి సమాధానం ఊహించక.

"అదేమిటి? నువ్విలాంటి పనెందుకుచేశావ్ వెంకన్నా? హడలి చచ్చాంగదా! ఎంతపని, ఎంత పనీ అవ్వ!" అని నోరు నొక్కుకుంది విమల.

"నాకేటి తెలుసు తల్లీ! నా కన్నిటితోపాటు యీ రికార్డులాంటిది యిచ్చి బుదవారం ఎనిమిది గంటలకు పెట్టమన్నాడు ఆ గుమాస్తాగోరే. ఆరి డబ్బులింటూ ఆరు సెయ్యమన్నేట్టు సెయ్యక పోతే ఎలాగ తల్లీ" అందరూ అనుమానంగా వెంకన్నవైపు చూశారు.

"అసలారికార్డు అవునో కాదో మళ్ళీ పెట్టి చూడండి" అన్నాడు సుధాకర్.

"వద్దు, వద్దు బాబోయ్. నేను మళ్ళీ వినలేను" చెవులు మూసుకుంది లచ్చి.

జగన్నాథాన్ని పక్కకి పిలిచి మాధవసింగ్ అన్నాడు.

"మనం వాడ్ని నుమానించవలసిన పనేమీ నాకు కనపడ్డంలేదు. ఎంచేతంటారా, వాడిధర్మం వాడు నెరవేర్చాడు ఏమంటారు?"

జగన్నాథం మాధవసింగ్ వైపు అనుమానంగా చూశాడు.

"నీ భార్యని గదిలో పడుకోనిచ్చి నువ్విలారా వెంకన్నా" అన్నాడు జగన్నాథం.

"ఉండుండు లేపకు. అలాగే మంచం సాయం పడదాం" ప్రసాద్ సహాయంతో వెంకన్న లచ్చి మంచాన్ని తనగదిలోకి చేర్చేడు. లచ్చి నిద్ర పోయేదాకా విసిరి వెంకన్న జగన్నాథం దగ్గరికి వచ్చాడు. అందరూ అక్కడ సమావేశమై ఆత్రంగా వింటున్నారు.

"మనం యీ విషయం మొదట్నుంచీ పరిశీలించాలి. రామన్నగారెవరు?"

"ఈ స్థలానికి యజమాని బాబూ"

"ఆసంగతి నాకూ తెలుసులే! అసలతనెవరు? అతని కేంపని?"

"చెప్పేను కాదు బాబూ యీ సంగతి తమరి కెంతతెల్సో నాకో అంతే తెలుసు."

"అలా అనడంలో నీ ఉద్దేశమేమిటి?"

"అలా అంటే నేనేటి సెప్పను? సచ్చపమాణంగా నాకేటీ తెల్దు. ఆరు రమ్మన్నారు, మే మొచ్చీసినాం అది గంతే?"

"ఎలా రమ్మన్నారు, ఉత్తరం ద్వారా నేనా?"

"సెప్పానుకాదు దొరా"

"ఉత్తరమేదీ?"

"ఉండండి తెస్తాను" వెంకన్న తన గదిలోకి వెళ్ళేడు. మొల్లోంచి తాళంతీశాడు, పెట్టె తెరచాడు ఉత్తరం తీశాడు.

రామారావు ఆ ఉత్తరం అందుకుని చదువుకున్నాడు.

"ఏమిటని రాశాడు?" అందరూ ఒకమాటే రకరకాలుగా అడిగేరు.

"ఏముందీ, మనకురాసిన భాగోతమే. ఇతన్ని మరోలా పిల్చాడు. అంతే తేడా"

"సంతకం ఏమనుందీ?"

"ఏ. తె. ఆ. రామన్న అనే!"

"ఇలాంటి విచిత్రపు సంతకంచూసి ఏమాత్రం ఆలోచించకుండా ఏమంటూ వచ్చావ్ వెంకన్నా?"

"ఎంతో చదువుకున్న దొరలు-మీలాంటోలే రమ్మనగానే ఒచ్చీసినోరుగండా నాలాంటి అచ్చర జ్ఞానంలేనోడు ఎవరిసేతో సదివించుకుని ఒస్తే తప్పేటిదొరా?"

పెద్దపెద్ద చదువులు చదువుకున్న జడ్జీగారూ, డాక్టరుగారూ, సోషల్‌వర్కరూ ఒక్కరూ తలెత్తలేదు. పదిమందికి పాఠాలుచెప్పే శాంతగానీ, తెలివైనదాన్ననుకున్న విమలగాని నోరెత్తలేదు. రామారావూ, ప్రసాదూ, నాయుడుగారూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఆఖరికి నాయుడుగారే నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ అన్నారు.

"మనం ఒక్కొక్కప్పుడు ఎంత తెలివి తక్కువగా ప్రవర్తిస్తూ ఉంటాం! ఎవరికీ తెలియని ఒక మనిషి పిలిచాడని..."

"ఆగండి, ఆగండి!" మాధవసింగ్ బల్లగుద్దుతూ అన్నాడు.

"నాకు తెలిసిపోయింది!"

"ఏమిటీ?" అందరూ అతనివైపు చూశారు.

"ఏ. తె. అంటే మీరె చెప్పేరు నాయుడు గారూ! ఏమిటో తెలుసా? "ఎవరికీ తెలియని" అని అర్థం" అన్నాడు మాధవసింగ్.

"ఇంకేం" చిక్కు విడిపోయింది. దాంతర వాత మాటే "ఆ. రామన్న" అనేది, ఆకాశ రామన్న అనకూడదూ?" అంది విమల ఏదో కని పెట్టాననే గర్వంతో "తెలిసిపోయినట్టే ఐతే!" "ఎవరికీ తెలియని ఆకాశరామన్న" అన్నమాట ఆ సంతకానికి అర్థం. ఇంక అతను వచ్చినట్టే, మనం వెళ్ళినట్టే!" అని పూర్తిచేశాడు జస్టిస్ జగన్నాథం.

మరునాడు ఆరయింది, పన్నెండయింది, మూడయింది. హాలులో గోడగడియారం తనపని నిర్వర్తిస్తూ గంటలు కొడుతూనేఉంది. ఆ రామన్నగారెవరో, అతను నిజంగా ఆకాశ రామన్నో ఏమోగాని ఊడిపడితే ఒట్టు.

"రోజుకి లాంచి ఎన్ని సార్లు వస్తుంది వెంకన్నా?" శాంతి అడిగింది.

"నాకేటితెలుసు తల్లీ, పెతీదానికీ నన్నడుగుతారు? మీరు నిన్నొస్తే మేము మొన్నచ్చినాం. మాకేటి తెలుసు?"

"ఎందుకమ్మా అలా అడుగుతారు? ఆ ఆకాశ రామన్నగాడు-వాడి ఉద్దేశమేమిటో ఎలాగా వచ్చేలా లేదు. తొందరపడి మనం యిక్కడికి

రావడమే ముప్పొచ్చింది" మధ్యలో నాయుడి గారిని ఆపేసి అన్నాడు మాధవసింగ్.

"రేపు తెల్లారీ సరికల్లా మళ్ళీ పడవర్రాదూ, అందులో మనం వెళ్ళిపోమా? ఇందులో పెద్ద వచ్చిన ముప్పేమిటి?"

"అవును. ఆపనే చెయ్యొచ్చు. ఇక్కడ మనం విలాస వినోదాలకోసం వచ్చాంగాని బితుకూ బితుకూమంటూ యీ మారుమూల, రోజు గడ వడమే కష్టంగా పడివుండే అవస్థ మనకేమిటి? మనం ఏం అన్నంలేక వచ్చామా?"

"బాగాసెప్పేరమ్మగోరూ! రేపు తెల్లారీ సరకల్లా ఎలా గొచ్చినవాళ్ళం అలా ఎల్లిపో వచ్చు. ఆ మాటే యిందాకల్నించి మీకు సెప్ప మని ఆడిని పీకుతున్నాను, మీకే తోచింది, అమ్మ గైరమ్మ! ఇప్పటికి నామనస్సుకి కాస్త ధైర్యంగా ఉంది. సుకంగా యింటి కెళ్ళిపోతే నీకు మేకపోతు బలిస్తా తల్లీ" అంది లచ్చి.

"ఆధైర్యం కలిగించడంకాదు గాని, లచ్చి రేపులాంచి వస్తుందని నమ్మకమేమిటి?" అనడి గాడు రామారావు.

"ఎందుకురాదు?" జడ్జీగారు తిరుగుప్రశ్న వేశారు.

"ఈ చిన్న ద్వీపంలో మన యిల్లు తప్ప మరోటి కనిపించడంలేదు. వెతికినా మన పది మందిమీ తప్ప మరో నరమానవుడు కనిపించే సూచనలూ లేవు. ఏమంత రాకపోకలున్నాయని యీ రేవుదగ్గిర రోజూ లాంచి ఆగడానికి?" రామా రావు మాటలు విని,

"రేపు కాకపోతే ఎల్లుండి కానియ్యవోయ్. మనం యింతమందిమీ ఉండి మన యిల్లే చేరలే మంటావా? చేరలేమని నే ననుకోను."

"ఇదేదో ముప్పులాగే ఉంది. ఈ ముప్పు తప్పేమార్గమే లేదంటారా?"

ఆశగా, వణుకుతున్న కంఠంలో అడిగాడు పాపం జగన్నాధం.

"ముప్పేమిటి ముప్పు? ఇంతకీ మనం చేసిన తప్పేమిటి?" ప్రసాదు మాటలువిని గోపాలరావు నాయుడు అన్నాడు.

"తప్పంటే జ్ఞాపకంవచ్చింది, నిన్నరాత్రి ఆకాశవాణి విన్నారుగా-దాంట్లో మనమందరం ఏవో తప్పులుచేసినట్లు, హంతకులైనట్లు నిరూపింపబడింది. దీన్నిగురించి మీ ఉద్దేశమేమిటి?"

"అందరూ హంతకులనే నా ఉద్దేశం" అన్నాడు చటుక్కున మాధవసింగ్. చేతులు ఒణికి కాఫీ చీరమీద పోసుకుంది విమల. కాలు స్తున్న సిగరెట్ రామారావు చేతులోంచి జారి పోయింది. అందరూ మాధవసింగ్ వైపు హంత కుణ్ణి చూసినట్టు చూశారు.

"ఆ రికార్డేమిటో, దాని సంగతేమిటో నాకు తెలియదుగాని, అది నావిషయంలోలాగే అందరి విషయాల్లోనూ నిజమే చెప్పిందని నా ఉద్దేశం ఓట్లతో సహా అందులో చెప్పబడినవన్నీ నిజమే! నేను సింధియాలో చేరిన మొదటి రోజుల్లో ప్రతాప్‌ని. పడవషికారుకి తీసికెళ్ళి లంచంతిని నా పాపిష్టి చేతులతో నీటిలో తోసేశాను. నేనూ కానాలని పడిపోయి ముందుగా మాట్లాడిన వారి చేత రక్షింపబడ్డాను. పాపం ప్రతాప్ ఏలోకంలో ఉన్నాడో! ఆకేసు "ఏక్సిడెంటు"ని కొట్టి వేయ బడింది. కోర్టు నన్ను ఏమీ చెయ్యలేకపోయింది కాని నాపాపం నన్ను శిక్షించక మానుతుందా? మీరందరూ హంతకులే అనీ, రకరకాల హత్యలు చేసి కోర్టు ఏమీ చెయ్యలేనివారనీ నా ఉద్దేశం. మన హృదయాలలోదాగిన దుశ్చింతన, దుర్మా ర్గాల అంతర్వాణిగాని అది ఆకాశవాణి కాదని నా నమ్మకం" చెప్పవలసిందేదో చెప్పి మాధవ సింగ్ తన గదిలోకి వెళ్ళిపోయి తలుపు వేసుకు న్నాడు. పదినిముషాలవరకూ ఎవరినోటా మాట లేదు.

## 3

అంత నిశ్శబ్దాన్ని ఆలాంటిసమయంలో భరిం చలేక జగన్నాధం మొదలెట్టేడు.

"ఏమిటో! అనుకుంటే మనంచేసే ప్రతీపనీ పాపమే. నా విషయంలో ఏమైంది? నేనురోజుకి ఎన్నో ఉరిశిక్షలు వేస్తూ ఉంటాను. ఇరుపక్షాల వకీళ్ళ తీర్పులూ విని శిక్ష విధించ డమేగాని ఎవరు దోషో, ఎవరు నిర్దోషో నాకేం తెలుస్తుంది? రామకోటికి నేనలాగే పెళ్ళాన్ని చంపేడన్న నేరంమీద ఉరిశిక్షవేశాను. అతను ఉరి తీయబడ్డ ఆరు నెలలకో ఎంతకో తెలిసింది సాక్ష్య పూర్వకంగా అతను నిర్దోషి అని. దానికి నేనేం చెయ్యను? ఇంతమాత్రాన నేను హంతకుణ్ణి ఎలా అయ్యాను?" అని జగన్నాధం పడక కుర్చీలో నిబ్బరంగా కూలబడ్డాడు.

"ఆ ఆకాశవాణి సర్వ అబద్ధం. ఒక్క మాధవ సింగ్ విషయంలో రైటేమో నాకు తెలీదు గాని నా విషయంలో మాత్రం అలా ఎన్నటికీ జరగలేదు, జరగదు కూడాను. నేను చెబుతున్న సంగతి చిట్టిపాప గురించి. నేను జడ్జీవారిబళ్ళో హెడ్ మిస్ట్రెస్‌గా ఉండేముందు కలక్టరుగారింట్లో చిట్టిపాపకు దాదిగా ఉండేదాన్ని. ఓ నాడు ఆ పాపతోనే తోటలో ఆడించడానికి వెళ్ళేను. ఆడుతూ ఆ అబ్బాయి ఎప్పుడు వెళ్ళినాడో యిట్టే కొలనులో పడిపోయినాడు. నేను కేకలువేసి అందరూ వచ్చేసరికి అంతా అయిపోయింది. ఇలాంటి తప్పులన్నీ నామీద పెడితే నా తరమా చెప్పండి?" పెద్దభారం దింపినట్టు నిట్టూరుస్తూ శాంత పూర్తిచేసింది.

"నీ సంగతేమిటి రామారావ్!" జగన్నాథం ప్రశ్నించాడు.

"ఏమిటో ఈ ఆరోపణ మీ మీద యెంత అన్యాయంగా ఉందో నామీదా అంతే. సీతమ్మ అని మా అమ్మతో మాట్లాడానికి అప్పుడప్పుడు వచ్చేది. 'చెడిపోయిన సీతమ్మ' అని దానికి ఈ ఊరంతా పేరు. ఓనాటిరాత్రి అది మా అమ్మతో మాట్లాడ్డానికి వచ్చి మా యింట్లోనే వుండిపోయింది. ఆవిడ మనసులో ఏం బాధలున్నవో ఆనాటిరాత్రి మా యింట్లోనే నూతిలో పడి చచ్చిపోయింది. మా యింట్లో మరో జబ్బు మనిషి ఉండడం చేత అతనుభయపడతాడేమోనని పోలీసులు రాకముందే శవాన్ని కాల్పించిన మాట మాత్రం నిజం, అందులో నేను చేసిన పాపం యేమీలేదు. నన్ను దోషిగా లోకంగాని, న్యాయశాసనంగాని పరిగణించలేదు. మధ్య వీడెవడు నన్ను హంతకుడనడానికి?"

"ఆడు కూసిందాంట్లో ఒక్క అచ్చరమైనా సత్తెం లేదు దొరా! మీ రేటనుకుంటే అనుకోండి. మా గూడెంలో సిట్టిపంతులికి అప్పుడు జొరమొచ్చినమాట నిజమే. ఆడికి ముందుకాడ్నించీ గుండె జబ్బు. నాకు వరుసకి పెదనాన్న వుతాడు. నేనూ లచ్చీ చచ్చేచాకిరీ సేసినాం. ఆనాడు రేతిరి జబ్బెక్కువయిపోనాది. వరసం, గుడిసె సట్టూ మెల్లోతునీరు. అయినా నేను డాకటేరుగారికాడ కెళ్ళినాను. ఆరులేరు. ఒస్తే సిట్టిపంతులు బతుకునేమో, ఎవడు సెప్పగలడు? మాపని మేం జేసినాం. ఇందులో మాతప్పేమిటి? ఏమంటావు లచ్చీ?"

"అవును మావా" అనలేకపోయింది లచ్చి. అన్నదీ అనుకొన్నదీ ఒకటికాకపోడంచేత కాబోలును.

"నీ సంగతేమిటోయ్ ప్రసాద్?" అని రామారావు అడిగాడు.

"ఏముందీ, మీ అందరిలాగే నేనూ ముమ్మాటికీ నిర్దోషిని. ఇంటిల్లిపాదీ ఒద్దంటున్నా ఇంటి దగ్గిర ఊరికె పడున్నాడనీ కాస్త సంపాదించుకుని తనూ 'మనిషి' అనిపించుకుంటాడనే సదుద్దేశంతోనే నేనూ మాబావ నారాయణమూర్తిని యుద్ధంలోకి పట్టుబట్టి పంపాను. కర్మవశాత్తు ఆతనక్కడే చనిపోతే దానికి నేనా కారకుణ్ణి? అదీ నా తప్పేనా?"

"మీరేమంటారు విమలగారూ?" రామారావే తిరికి అడిగాడు.

"అనడానికేముంది?" తిరుగు ప్రశ్న వేసింది నిశ్చయం సూచిస్తున్న కళ్ళతో విమల.

"ఏమీలేదా?"

"ఏముంది? నా మనస్సాక్షికి విరుద్ధంగా, నా అంతరాత్మకి వ్యతిరేకంగా ఒక్క పనీ చెయ్యలేదు. అందుకనే మనిషి కూసినా ప్లేటుకూసినా నాకేం భయమూలేదు, లక్ష్యమూలేదు."

"సుబ్బులక్ష్మి ఎవరుమరి? మీకు సంబంధించింది కాదా?"

"కాకేం? ఉదహరించిన పోర్లకి మీకూ ఎలా సంబంధముందో నాకూ సుబ్బులక్ష్మికీ ఆ మాత్రం సంబంధం లేకపోలేదు. అది నా బంధువురాలు. నాపెళ్ళి కివచ్చిందది. ఏం జబ్బు చేసిందో- రేపు నా పెళ్ళనగా రాత్రి దొంగలు దాన్ని చంపి మెళ్ళో నగలు లాక్కున్నారో ఏమో- చింత తోపులో తెల్లారేసరికి, దానిబ్రతుకే తెల్లారి చచ్చిందుంది. ఆ దొంగల్ని కాదని నన్ను హంతకురాల్ని చేసిన ఈ పాపిష్టివాడి గొంతుక యెప్పుడు పడిపోతుందో!"

ఈ మాటలు అని విమల తిరిగి తన స్వెటరు అల్లికలో నిమగ్నురాలయిపోయింది.

"నా సంగతా? అక్కర్లేదు. ఎవరూ అడక్కండానే చెబుతాను. నేను సిటీలో నెం. 8 బస్సుకి '30లో డ్రైవరుగా పనిచేసినవాణ్ణి.

ప్రమాదవశాత్తు వెంకట్రావు అనే అతను సరిగ్గా ఫిబ్రవరి పన్నెండునే కారుకిందపడి చారుమని చచ్చాడు. ట్రాఫిక్ రూల్సు వెంకట్రావుసరిగా పాటించకపోడం కూడా నా తప్పే అనుకోవల సిన అవసరం కనపడదు నాకు."

మూడో కేటి వివరాలు మూడుముక్కల్లో చెప్పి నిశ్చితంగా చుట్ట ముట్టించాడు గోపాలరావు నాయుడు.

"ఇంక ఎటొచ్చీ మిగిలినవాడ్ని నేనేకదా! నామీద యీ ఆరోపణ ఎంతన్యాయంగాఉందో చూద్దాం. ఇంతకీ ఎవరుచెప్మా ఆ సుబ్బారావు? ఇంతమంది పేషెంట్లు మా డిస్పెన్సరీకి వచ్చారు గాని ఆ పేరుగలవాడొచ్చినట్టు జ్ఞాపకమైనా లేదే! అయినా ఎవడికి జ్ఞాపకం? వచ్చినా వచ్చి ఉంటాడు. ఆపరేషన్ కేసే అయ్యుంటుంది. ఆపరేషన్లు ఎంతజాగ్రతగా చేసినా చస్తే సర్జను మీదకే తోస్తారు. ఇలాంటివి ఎవరుచెప్పగలరు? ఇంతకీ ఆ సుబ్బారావుపేరు నిశ్చయంగా విన్న ట్టయినా జ్ఞాపకంలేదుసుమండీ నాకు!"

డాక్టరు నోటికి తెర వాల్చగానే తన తెర తీసింది శాంత.

"ఆశ్చరం, ఆశ్చర్యమాని! ఆ దొంగముండా కొడుక్కి మనపేర్లు, మనకి సంబంధించినపేర్లు ఎలా తెలిశాయో! మనం చెయ్యలేదుగాని ఆ చావులు చెప్పిననాడే జరిగాయి సుమండీ. ఇందు యింకో విశేషం పోల్చారుగారు! అన్నీ కోర్టుకి దొరకని చావులే! మాధవసింగ్ ఒక్కడే ఒప్పు కోడం చూస్తే..."

"అతనిమీద అనుమానం కలగడం అసహజం కాదు" శాంత మాటలు ప్రసాద్ పూర్తిచేశాడు.

"అబ్బ, ఏమిటీ కంపూ?" విమల హఠాత్తుగా ముక్కు మూసుకుని అంది.

"ఏమిటీ, కంపేమిటి, నాకేంవెయ్యడంలేదే!" అన్నాడు జగన్నాథం.

"మీకు రొంపట్టిందో ఏమిటో-ముక్కు బద్ద లైపోతుంటేనూ! నారాయణ! నారాయణ!" రామారావు అన్నాడు. అందరూ ఒప్పుకున్నారు.

"అదిగో మాధవసింగ్ గదిలోంచి కాబోలు వస్తోంది-ఏం వెంకన్నా అంతేనంటావా?"

"నిజమే దొరా, ఆయనదగ్గర సారాకాయ నిన్న నేచూశాను."

"అంత పబ్లిగ్గా తాగడమే, ప్రొహిబిషన్ లేదూ?"

"ఇంకా మీ చాదస్తం వదుల్చుకున్నారు గారు, చట్టాలుపెట్టేరని ఎవరేపని మానేరుగనక? అయినా నలుగురిలో ఏమిటీ న్యూసెన్సు? పదండి వెళ్ళి అడుగుదాం" గోపాలరావునాయుడు వెనక అందరూ మాధవసింగ్ గది వైపు నడిచారు. నాయుడు తలుపుకొట్టాడు, సింగ్ తలుపుతీశాడు. గదిలో అతను తాగి తందనాలాడుతున్నాడు.

"ఏయ్, పదిమందిలో ఏమిటయ్యా యీ న్యూసెన్సు?"

"న్యూసెన్సా? మీలో యే ఒక్కడికైనా కామన్‌సెన్సు అన్నది ఉంటే ఆ మాట అడుగు తారా? నా పాపపు చింతను మరపించే మధుర మధువు! నా చితికిన మనసును అతికించే మరుని వధువు! నా ప్రతాప్‌నీ నన్నూ ఏకంచేసే..." సింగ్ కక్కుకున్నాడు. తెరలు తెరలుగా కక్కు కున్నాడు. ఆఖరుసారి కక్కుకని పడిపోయాడు. వెంటనే సుధాకర్ చెయ్యి పట్టుకుని చూశాడు. చేతిలో వేడిలేదు, నాడీలేదు.

ఎవరి మొహంలోను కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు. ఇలా అవుతుందని ముందెవరూ అనుకోపోబట్టి కాబోలు అందరూ నిశ్చేష్టులై పోయి, అచేతనంగా పడివున్న మాధవసింగ్‌వైపు రెప్ప వెయ్యకుండా చూస్తున్నారు. ఆఖరికి రామారావు అన్నాడు,

"ఎలా చచ్చిపోయాడంటారాయన?"

"చూశాంగా, విపరీతంగా కక్కుకున్నాడు, చచ్చిపోయాడంతే"

"ఎంతెంత విషయాలైనా నిముషంలో తేల్చె య్యడానికి మీకు మీరేసాటి విమలగారూ! విప రీతంగా కక్కుకున్నంత మాత్రాన ఎవరయినా చచ్చిపోతారా?" అని తిరుగు ప్రశ్న వేశాడు రామారావు.

సుధాకర్ అన్నాడు పరీక్షించి—

"ఊరికే ఎంతమాత్రమూ చావలేదు - కక్కు కున్నంతమాత్రన ప్రాణాలు పోలేదు. విష ప్రయోగం!"

"ఆఁఆఁ ఏమన్నారూ? విషప్రయోగమా?" అందరూ కలవరపడజొచ్చారు.

"అవును, విషప్రయోగమే, స్పష్టంగా తెలుస్తూంటే!"

ఒక్క జగన్నాథంమాత్రం చలించక గంభీరంగా అన్నాడు.

"ఒక్క సంగతి మనం గమనిస్తే యింత భయపడవలసిన అవసరంలేదు. అతను ఆత్మహత్య చేసుకున్నాడేమో!"

అవునంటే అవునన్నారు అందరూ.

"అసలు అతని ప్రవర్తన పొద్దుట్నుంచీ అనుమానకరంగానే ఉంది. అతను తప్పుచేసినవాడిలా క్షణక్షణం బాధపడుతూవచ్చాడు. ఇందాక వెడుతూ వెడుతూ ఏమన్నాడో చూశారుగదూ!" న్యాయశాసనం నన్ను శిక్షించలేకపోయినా నా పాపం నన్ను క్షమిస్తుందా?" అని అతను పాపభీతిచేతే ప్రాణం తీసుకున్నాడని నా నమ్మకం అంది శాంత.

"నిజమే" అన్నట్టు చూశారందరూ.

"అంతేనా? మీరందరూ అదే నమ్మకంతోనే ఉన్నారా?" సుధాకర్ అడిగాడు. అవునన్నారందరూ.

"నాకుమాత్రం నమ్మకంలేదు. అతను ఆత్మహత్య చేసుకున్నాడని నే నమ్మను"

"ఏంచేత?"

"ఏమో, నాకలా తోచిందిఅంతే." డాక్టరూ నాయుడుగారూ మాధవసింగ్ మృత దేహాన్ని అతని పక్కపైచేర్చి పూర్తిగా గుడ్డ కప్పేశారు. ఆ రాత్రి అందరూ దీనంగా, విచారంగా, భయంగా ఏదో పేరుకు భోంచేశారు. వారు ముందే అనుకున్నట్టు రామన్నగాని, ఏ యితర పడవగాని ఎంతచూసినా ఆ తీరంవైపే రాలేదు. ఆరాత్రి భోంచేసి ఒకరిదగ్గర ఒకరు శలవు తీసుకుని భారంగా గదులలోకి వెళ్ళి తలుపేసుకున్నారు.

"నేనిక్కడ్నుంచి ఎలా వెళ్ళేది?" అనుకుంది శాంత. కిటికీ తీసింది. ఒకదాన్ని ఒకటి కొట్టుకొంటున్న కెరటాన్ని చూసింది. ఆ నల్లటి గంభీర ఆకారాన్ని ఆట్టేసేపు చూడలేక కిటికీ తలుపులు వేసేసింది. పరచివున్న పక్కమీద పడుకుంది. ధైర్యంగా ఉందామని ఎన్నివిధాల నచ్చచెప్పుకుందామనుకున్నా ఆమెకు భయం పోవడం లేదు.

"నేను సురక్షితంగా ఎలా యింటికి వెళ్ళగలను?"

"ఈదేస్తేసరి" ఈ మాట మనసులో అనుకోడానికయినా ఆమెకు ధైర్యం చాలలేదు. ఆమెకు యీతవచ్చి, పిల్లాడ్ని రక్షించగలిగినదైనా చిట్టిపాప కొట్టుకొనిపోతున్నా చూస్తూ ఊరుకుని— అసలు తనకు యీతే రాదని కోర్టులో వాఙ్మూలం యిచ్చింది. ఎవరికోసమని యింత కల్మషం కడుపులో దాచుకుంది తను? ఏ ఆనందమూర్తి అవలోకనంకోసం? కలక్టరుగారి తమ్ముడు రామగోపాలం కోసం. అతని వేడివాడి చూపుల్లో తన యెంతటి పట్టుదలయినా కరిగి నీరయిపోతుంది. రామగోపాలం, నీకోసమేగదా, నీకు ఆస్తి రావాలనేగదా, యింత పాపానికి ఒడిగట్టుకున్నాను! నన్నెప్పుడు రాణిని చేస్తావ్ రామగోపాలం? నిన్నెప్పుడు చేరుకోగలను రామగోపాలం?"

"వచ్చి, నిండా రోజున్నర అవలేదు. అప్పుడే ఒక చావా?" నిద్రరాక మంచమీద అటూ యిటూ తిరుగుతున్నాడు ప్రసాద్. "నువ్వు మా బావ నారాయణమూర్తిని సదుద్దేశంతోనే యుద్ధంలోకి పంపేవా? పాపం, గొప్ప సదుద్దేశమే!" అతని అంతర్వాణి అతన్ని నిలదీసినట్లయింది. అతని ఆకారమే నల్లగా, భయంగా అతన్ని ఆ చీకటిలో అడ్డగించిందా అనిపించింది. అతనికి అరుద్దామన్నా గొంతు కూడా రాలేదు. స్విచ్ ఎక్కడుందో తడిమవేసుకునేసరికి అతనికి చచ్చి బ్రతికినంతయింది. గదంతా కాంతిమయం అయింది. అతని హృదయంలోకి చీకటిమాత్రంపోలేదు. "సదుద్దేశం కాక?"

"అవును. గొప్ప సదుద్దేశమే! నీవాణికి యెంత ఉచ్ఛనీచాలు లేకపోయినా, నీ అంతర్వాణి మాత్రం మారదనీ, నిన్ను బ్రతికున్నంతకాలం వీడదనీ తెలుసుకో. ఎవరిదగ్గర అబద్ధాలాడినా నీ మనసును కప్పగలవా ప్రసాద్? తనకూ, తన భర్త నారాయణమూర్తికీ పడడంలేదనీ, తనకి మారు ప్రియుడున్నాడనీ తనభర్త నెలాగైనా చంపించమనీ మీ అక్క సుభద్ర నీకు గాజుల జత యివ్వలేదూ? చేసిన పాపం చాలక యింకా ఏ మొహం పెట్టుకు అడుగుతున్నావు? నీపాపం నిన్ను కొట్టక మానుతుందా?"

"నాచేత ఎంతపాపం చేయించావు సుభద్రా" అనితల బాదుకున్నాడు ప్రసాద్.

"అన్నం ఉంది, నీరువుంది. కావలిసినవన్నీ ఏర్పరిచాడు రామన్నగాడు. అయితేనేం? సుఖం లేకపోయాక యివన్నీ ఎందుకూ? ఎందుకూ?" అని సాగదీసుకుంది విమల. ఆమెకు తనమీదా, తన పోకులమీదా విపరీతమయిన అసహ్యాభావం కలిగింది. ఆ కాశీరామన్న గారు ఏర్పరిచిన సదుపాయాలమీద మరీ ఒళ్లు మండుకొచ్చింది. కాళ్ళతో దుప్పటిని తీసి పారేసింది. పరుపుమీంచి లేచిపోయింది. కిందని చాప తలగడా వేసుకుని పడుకుంది, ఆమెకు కాస్సేపట్లో నిద్రపట్టింది.

"ఏముంది! నా మనసాక్షికి విరుద్ధంగా, నా అంతరాత్మకి వ్యతిరేకంగానే ఒక్క పనీ చెయ్య లేదు. అందుకనే మనిషి కూసినా, ప్లేటు కూసినా నాకేం భయమూలేదు, లక్ష్యమూలేదు."

"అలాగా? ఆహా!" వెక్కిరిస్తూ పెద్ద వికటాస్సహాసం! ఎవరది? ఎవరిది యీ భయానక దంష్ట్రి గర్జన? ప్రాణాలు తీసే ఈ పరిహాసం ఎవరిది? విన్న గొంతుకలాగే ఉంటే! ఆ ఎవరిది? తెలిసింది. అదుగో మాధవసింగ్! అదేమిటీ మాధవసింగ్ చనిపోలేదూ!

"ఆ రికార్డు చెప్పేనట్టు మనమందరం హంతకులమే! నేను హంతకుడినే నువ్వూ హంతకివే!"

"బాగుందండోయ్ నేనేం చేశాను!"

"చాల్లేనమ్మా చేసిందిచేసి, ఇంకా ఏమంటూ అడుగుతున్నావు? సుబ్బులక్ష్మిని చంపిందెవరు? పాపం ఏమీ ఎరుగని ఆ అమాయకురాల్ని—నీ భర్తను ప్రేమిస్తోందేమోనని అనుమానపడి మనుష్యుల్ని లంచంయిచ్చి రాత్రికిరాత్రి పంపింది నువ్వుకాదూ?"

"అయ్యో! మీకీ సంగతులన్నీ ఎలా తెలుసు మాధవసింగ్?"

"తెలియక పోవడమేమిటీ? మరి హంతకు డెవరనుకున్నావు? ఆ ఆకాశీరామన్నని నేనే! చూడిప్పుడు నా నిజస్వరూపం?"

మాధవసింగ్ విమలదగ్గరగా వచ్చి బలిష్టమైన తన రెండు చేతులతోనూ మెడపట్టుకున్నాడు! గట్టిగా నొక్కేస్తున్నాడు విమల అరుద్దామని విశ్వప్రయత్నం చేసినా నోరురాలేదు. ఆ పెనుగులాటలో ఆమెకు తెలివి వచ్చేసింది.

"అమ్మయ్య! ఇదంతా కలా? ఎంత భయంకర స్వప్నం?" చెమటపట్టిన నుదుర్ని పమిటితో తుడుచుకుంది విమల.

సుధాకర్‌కి ఎంతకీ నిద్రపట్టడంలేదు. కళ్లు మండుతున్నాయి. ఒళ్లు అలసటను సూచిస్తోంది. నిద్రమాత్రం రావడంలేదు. హాండ్ బేగ్ తీసి ఓ "స్లీపింగ్ డోస్" వేసుకుని యిన్ని మంచినీళ్ళు తాగి పడుకున్నాడు. పావుగంటయినా నిద్రరాక పోగా, వచ్చే లక్షణాలయినా లేవు.

"సుబ్బారావు పేరుగల పేషెంటే నీదగ్గరకు వచ్చినట్టు జ్ఞాపకంలేదూ? ఔరా! ఎంత ఈజీగా కోశావ్ సుధాకర్! అవునవున్లే, ఎలాజ్ఞాపకముంటుందీ? ఆ ఆపరేషనే అంత బాగాచేశావ్?"

"అయినా నీకు మనిషిప్రాణాలతో ఆటలా? తాగేసి, నీయిష్టంవచ్చినట్లు ఆపరేషన్ చేస్తావా? ఆనాడు సుబ్బారావు పెళ్ళాం హేమం ఆరునెలల పాపా—నీ కళ్ళముందు, కరడుగట్టి పోయిన నీ చెవుల్లో శాశ్వతంగా నిలిచిపోయిన వాళ్ళ రోదన ఊరికేపోదులే డాక్టర్!"

ఆలోచనలు అడ్డేసి ఆటకాయించి, నిలబెట్టి, నిలదీసి అతనికి ఆ రాత్రి క్షణమయినా నిద్ర లేకుండా చేశాయి. గడియారం మూడు కొట్టేక కాబోలు చిన్న నిద్రపట్టింది.

## 4

సుధాకర్ లేచి కిటికీతలుపు తెరచేసరికి, సముద్రపు సుదుటిమీద కుంకుమబొట్టులా సూర్యుడు కనిపించాడు. తలుపు ఎవరో 'టకటక' మని కొడుతున్నారు.

"బాబూ, బాబూ, తలుపుతియ్యండి, త్వరగా" వెంకన్న గొంతుక విని సుధాకర్ వెంటనే తలుపుతీశాడు. వెంకన్న ఒణుకుతూ అన్నాడు:

"బాబూ! మా నచ్చిమి లేపినా లెగడంలేదు. తమరు వెంటనే దయసెయ్యాల" మందులబేగ్ తీసుకుని సుధాకర్ వాళ్ల గదిలోకి వెళ్ళేడు. నులక మంచంమీద లచ్చి చచ్చినట్లు పడుంది. సుధాకర్ పరీక్షచేసి పెదవి విరచాడు.

"ఏమైందీ, ఏమయింది దొరా? తొరగా సెప్పండి" వెంకన్న ఆత్రుతతో అడిగేడు.

“ఏముంది వెంకన్నా? నీ లచ్చి నిదురలోనే చచ్చిపోయింది.”

దుర్వాసనగాని దుర్వార్తగాని ఎంతసేపటిలో వ్యాపించాలి? కాలకృత్యాలు కూడా మాని అందరూ అక్కడికి క్షణంలో ఆకర్షింపబడ్డారు. వాడిపోయిన మొహాలతో అందరూ అక్కడే కూలబడ్డారు.

“ఎలా? ఎలా? ఎలా చనిపోయింది లచ్చి?” అందర్నీ వేధించిన సమస్య అదే.

“ఇదీ ఓ విధమైన ప్రయోగమే! నిద్రమందు బాగా ఎక్కువగా కలపబడింది. ఈమె ఓ రాత్రి వేళ ప్రాణాలు విడిచింది” అని తేల్చాడు సుధాకర్.

“ఏవిధంగా కలపబడింది? రాత్రి లచ్చి ఏం తాగింది వెంకన్నా?” జగన్నాథం అడిగాడు.

“డాకటేరుగోరు బలానికీ, నిద్రకీ కలిపి యిచ్చిన మందుతప్ప మరేటీ తాగలేదుబాబూ!”

“నీకు జ్ఞాపకంలేదేమో! రాత్రి ఏం ఆహార మిచ్చావ్? ఓ కప్పుకాఫీ అయినా యివ్వలేదా?” విమల అడిగింది.

“లేదమ్మగోరూ. ఆరుపేటీ యివ్వద్దొన్నారు. నేనే టీ యివ్వనూలేదు.”

అందరూ సుధాకర్ వైపు చూశారు. అతనేం మాట్లాడలేదు.

“అయిందేదో అయినాది. కాఫీలు తెస్తాను తాగండి” వెంకన్న వంటింట్లోకి వెళ్లేడు.

“ఎంత ఆశ్చర్యమో చూడండి. అవ్వ! భార్య పోయినట్టు తెలిసి ఇంకా పదినిముషాలేనా అవ లేదు. కాఫీలు తెస్తానని బయలుదేరేడు. ఎంత ధైర్యమో! చూస్తే వీడే పెళ్ళాన్ని చంపుకు న్నట్టున్నాడు” శాంత అడిగింది.

“ఏ పాపం ఎరుగను నేను. నిన్నరాత్రి ఇంత గ్లూకోజూ, నిద్రమందూ యిచ్చాను అంతే. చూస్తే ఇదంతా నామీదకు తోసేసీలావున్నాడు కర్మ-కర్మాని!” ఎర్రబడ్డ కళ్ళను బరువుగా మూసుకుని కుర్చీలో కూలబడ్డాడు తలపట్టుకొని సుధాకర్.

“బాబుగారోయ్ యిది సూసినారా?” వెంకన్న ఒక్క గంతులో వంటింట్లోంచి వచ్చాడు. అందరూ ఎంతో కుతూహలంతో అటు తిరి గారు. “మనం అప్పుడు సూసినప్పుడు-అక్కడ అంటే నడవగదిలోపల సిలకలున్నాయాః? నిన్న అంటే సింగీ బాబుగోరు పోయాక ఆ గది సద్ద బోతే సిలకలు తొమ్మిదే ఉన్నాయి. లెక్క తప్పేమో అనుకున్నాను అప్పుడు. ఇప్పుడు నాలుగుమార్లు లెక్కెట్టినా ఎనిమిది సిలకలే ఉన్నాయి దొరా! ఏటి దీనికర్థం?”

(తరువాయి వచ్చేసంచికలో)

# అసురధర్మం

“భాగి”

మన్నుకరగగ చెమటకార్చాం
  మిన్నుచినగగ కేకవేశాం
మన్నుకొట్టి మాదనోటా
మిన్నులంటే కీర్తిస్తంభాలే
కట్టుకున్నారా!
ఆలుబిడ్డల ఉనికిమరచి
రేయి పవలూ, రెప్పవాల్చక
బొమికలన్నీ చివికిపోవగ,
కూర్చినా మా కష్టఫలముకు
ధర్మకర్తలు, మీసమూపి
మీరెయ్యంచు—పూలదండలు
వేసుకొన్నారా!
చిగురు మనసుల చితులుపెట్టి
పగులు చూపిన గుండెసెగలకు
అగరువత్తుల ధూపమూది
ఇగిరిపోయిన వరుగుబ్రతుకుల
తోరణాల్—మీ సౌఖ్యభువనపు
ప్రాంగణాలకు అందమిడెనని
చిందులేస్తారా!